క్లుప్తంగా

పోస్టల్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నవీన్‌కుమార్ తదితరులు

అమలాపురం టౌన్: ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఎన్‌పీవో) యూనియన్ నూతన సంవత్సరానికి ముద్రించిన క్యాలెండర్‌ను స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ బుధవారం రాత్రి ఆవిష్కరించారు. పోస్టల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎఫ్ఎన్‌పీవో చొరవ చూపుతున్న యూనియన్ అని కొనియాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీధరం, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు వంశీ, అమరనాథ్, యూనియన్ నాయకులు ఎం.ఏకాంబరం, ఎం.నరసింహం, బి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కలశం నూతన క్యాలెండర్..



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అముడా, కలశం ప్రతినిధులు

కోనసీమ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ ఆర్కిటెక్ట్స్ సర్వేయర్స్ ఇంజినీర్స్ మెంబర్స్ వెల్ఫేర్ (కలశం) 2025 నూతన సంవత్సరానికి ముద్రించిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక కొంకాపల్లిలో జరిగింది. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, పీవో ఎ.సత్యమూర్తి, మున్సిపల్ కమిషనర్ కేవీ ఆర్ఆర్ రాజు తదితరులు ఈ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కలశం జిల్లా అధ్యక్షుడు యేడిద దొరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బి.రాణి సంయుక్త, అముడా ఏపీవో పి.ఉమామహేశ్వరరావు, కలశం జిల్లా ప్రధాన కారదర్శి నల్లా ఫణికుమార్, జిల్లా కోశాధికారి మలిశెట్టి నాగేశ్వరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అరిగెల సుబ్బారావు, అమలాపురం కలశం అధ్యక్షుడు ఐ.బాలకృష్ణ, కార్యదర్శి ఎస్.శ్రీకాంత్, కోశాధికారి కె.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలలో..

పట్టణంలోని వడ్డిగూడెంలో ఉన్న శ్రేయ దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో విద్యా సంస్థ 2025 నూతన సంవత్సరానికి ముద్రించిన క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం దివ్యాంగుల సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీమన్నారాయణరావు, కేవీఆర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కె.అనంతలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ కొర్లపాటి దశరథరామయ్య, ఉపాధ్యాయులు తులసి, పుష్ప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రేపు పరిహారం పంపిణీ

ఐ పోలవరం: తాళ్లరేవు మండలంలో కోరంగి గ్రామంలో శుక్ర జరిగే కార్యక్రమంలో మత్స్యకారులకు ఓఎన్‌జీసీ నష్ట పరిహారం పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం కోరంగి ఎన్‌హెచ్-216 పక్కన జరిగే కార్యక్రమంలో రెండు జిల్లాలు 5 నియోజకవర్గాలు, 8 మండలాలకు చెందిన 69 గ్రామాల అగ్నికుల క్షత్రియ, ఇతరులకు 23,548 మందికి రూ.148 కోట్ల పరిహారం పంపిణీ చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి అచ్చెంనాయుడు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు.

జీతాల పెంపు నిర్ణయం హర్షణీయం

అమలాపురం రూరల్: రాష్ట్రవ్యాప్తంగా 108 ఉద్యోగులకు నెలకు రూ 4 వేల జీతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం అమలాపురంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బొక్కా జితేంద్ర అధ్యక్షతన సమావేశం జరిగింది. రాష్ట్ర నాయకులు మట్టపర్తి నాగశ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి చిట్టిబాబు, అమలాపురం నాయకులు అధికారి శ్రీనివాసరావు, ఈ.ఈశ్వర్ మాట్లాడుతూ, కొత్తగా 190 వాహనాలను కొనుగోలు చేసేందుకు నిర్ణయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలు మెరుగుపరిచి, మంచి పేరు తెస్తామన్నారు.

పలువురికి సూపరింటెండెంట్లుగా పదోన్నతి

యానాం: వివిధ ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్లుగా ఉన్న వారికి సూపరిండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ బుధవారం డీపీఏఆర్ కార్యదర్శి వి జయశంకర్ ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్(రెవెన్యూ)యానాంలో పనిచేస్తున్న మహ్మద్ అబ్దుల్‌సుభాన్‌కు పుదుచ్చేరి లేబర్ ఆఫీసర్‌గాను, విద్యుత్ శాఖలో పనిచేస్తున్న పి సత్య వరప్రసాదరావుకు పుదుచ్చేరిలో విద్యుత్ శాఖ ఈహెచ్‌వీ(డివిజన్-4) సూపరింటెండెంట్‌గా, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖలో ఆఫీసర్/డిప్యుటేషన్‌పై సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న రెయ్యా శ్రీనివాస్‌ను పుదుచ్చేరి ఫార్మసీ చీఫ్‌గా నియమించారు. అదేవిధంగా మరో 27 మందికి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



అమలాపురం మూడు తూముల వద్ద పరిస్థితి ఇలా..



అమలాపురం చిందాడగరువు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు



నడుపూడి లాకుల వద్ద పేరుకుపోయిన ప్లాస్టిక్ చెత్త

కాలువలను కబళిస్తూ..

- సాగు నీటి వ్యవస్థకు అవరోధంగా మారుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని డ్రెయిన్లలో పేరుకుపోయిన వైనం
- తూతూమంత్రంగా అధికారుల చర్యలు

ఐ.పోలవరం: పంట కాలువలు, మురుగు నీటి కాలువలు తూడు, గుర్రపు డెక్క కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలతోనే అధికంగా నిండిపోతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇతర వ్యర్థాలతో పంచాయతీ డ్రెయిన్ల నుంచి ఇరిగేషన్ డ్రెయిన్ల వరకు పూడుకుపోతున్నాయి. పంట బోదెల నుంచి ప్రధాన పంట కాలువల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. దీనివల్ల పంట కాలువల నుంచి చేలకు సాగు నీరందడం లేదు. మురుగు నీటి కాలువల నుంచి ముంపు నీరు దిగక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు..

రబీ సాగు ఆరంభమైంది. ప్రతి పంట కాలువ అధ్వానంగానే ఉంది. తూడు, గుర్రపు డెక్కతో పంట కాలువలు పూడుకుపోయాయని రైతులు వాపోతున్నారు. వాటిని తొలగిస్తామని సాగు నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ వాటి కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలే అధికంగా కాలువలను కబళిస్తున్నాయి.

ప్రతి కాలువలోనూ..

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో సుమారు 45 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతోందని అంచనా. ఈ పొలాలకు ముక్తేశ్వరం, కోరంగి, చల్లపల్లి, అల్లవరం ప్రధాన పంట కాలువలు, వాటి అనుబంధంగా ఉన్న మీడియం కాలువలు, చిన్న కాలువలు (పంట బోదెలు) ద్వారా సాగు నీరందుతోంది. ప్రతి కాలువల్లోను ప్లాస్టిక్ వ్యర్థాలున్నాయి. ప్రధాన పంట కాలువల్లో లాకుల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. అలాగే ప్రధాన పంట కాలువలకు అనుబంధంగా ఉన్న సుమారు 28 మీడియం కాలువలు, లెక్కలేనన్ని పంట బోదెల్లో సైతం ప్లాస్టిక్ పేరుకుపోతోంది. దీనివల్ల చిన్న రెగ్యులేటర్లు, డైరెక్ట్ పైపులు, తూముల వంటి వాటి వద్ద ప్లాస్టిక్ పేరుకుని ఆయకట్టుకు నీరందడం లేదు.

అక్కడక్కడా తొలగింపు

రబీ మొదలు కావడంతో అక్కడక్కడా పంట కాలువల్లో వ్యర్థాలను తొలగిస్తున్నారు. అక్కడ కూడా ప్లాస్టిక్ వ్యర్థాలను పెద్దఎత్తున తొలగించాల్సి వస్తోంది. దీనివల్ల తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఐ.పోలవరం మండల పరిధిలో కేశనకుర్రు చానల్ ద్వారా శివారుకు నీరందడం లేదని పూడిక తొలగింపు పనులు చేపట్టారు. ఇక్కడ వెలువడుతున్న వ్యర్థాల్లో మూడొంతులు ప్లాస్టిక్ ఉండడం గమనార్హం.



ఐ.పోలవరంలో పొక్లెయిన్ ద్వారా తొలగిస్తున్న వ్యర్థాలు

ఏడాదికి రెండు సార్లు తీయాలి

పంట కాలువల్లో చెత్తాచెదారాల వల్ల రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువల్లో పూడికతీత, వ్యర్థాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను అధికారులు ఏడాదికి రెండు సార్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలి. దీనివల్ల శివారు ప్రాంత రైతాంగానికి సాగునీరు అందడమే కాకుండా, కలుషితం కాకుండా ఉంటుంది.

– యాళ్ల దశరథరామయ్య, రైతు, తిల్లకుప్ప

అవగాహన కల్పించాలి

పంట కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పాడేయడం వల్ల నీరు పూర్తిగా కలుషితం అవుతుంది. రైతాంగానికి కాలువల వెంబడి ఉన్న దుకాణదారులకు, ప్రజలకు ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలి.

– పిన్నమరాజు మణిరాజు, రైతు, కేశనకుర్రు

12 నుంచి కచ్చితంగా హెల్మెట్లు ధరించాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఈ నెల 12 నుంచి ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని బుధవారం పుదుచ్చేరి హోం మంత్రి నమశ్శివాయం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, హెల్మెట్ ధారణపై వాహనచోదకుల్లో అవగాహన కల్పించేందుకు 11న ఎల్జీ కె కైలాషనాథన్, సీఎం రంగసామి ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా హెల్మెట్‌ను ధరించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, ఆ విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఇటీవల కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఉన్నత స్థాయి సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

వలకట్ల ఏర్పాటుకు వేలంపాట

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరం అనుకుని ఉప్పుటేరు, పంచనీటి కాలువలో వలకట్లు ఏర్పాటు చేసి, మత్స్య సంపదను వేటాడుకోవడానికి ఎస్.రామేశ్వరం మత్స్యకార సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వేలంపాట నిర్వహించారు. మూడు విభాగాల్లో ఎత్తి వల, చిట్టివేట, వలకట్ల ద్వారా పీతలు, రొయ్యలు, చేపలను వేటాడుకోవడానికి వేలంపాట జరిగింది. ఈ వేలంపాటలో గ్రామానికి చెందిన కొంత మంది మత్స్యకారులు రూ.లక్షల్లో వేలంపాటను దక్కించుకున్నారు. మూడు విభాగాల్లో రూ.15 లక్షల వరకు పాటలు జరిగాయని స్థానికులు తెలిపారు. వేలం పాటలతో కేవలం ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే లబ్ధి పొందుతున్నారని, వేటే జీవనాధారంగా బతుకుతున్న మత్స్యకారులకు చేపలు లభ్యం కావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వేలంపాటలు వద్దని సూచించినా గ్రామ పెద్దలు డబ్బుకు ఆశ పడి తమ కడుపు కొడుతున్నారని తెలిపారు. వేలం పాటలు నిలిపివేయాలని తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, కార్యదర్శి చిక్కం శ్రీనుకు డిసెంబర్ 9న పంతాడి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా వేలంపాటలు జరగడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, వేలంపాటను రద్దు చేయాలని కోరుతున్నారు.

నిరసన స్వరానికి దిగొచ్చిన అధికారులు

- వెంకన్న ఆలయంలో జనరేటర్‌కు షెల్టర్ ఏర్పాటు

అమలాపురం టౌన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఓ దాత రూ.12 లక్షల వ్యయంతో సమకూర్చిన జనరేటర్‌కు ఎట్టకేలకు ఆలయ అధికారులు నీడ కల్పించేలా ఓ షెల్టర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పది నెలల కిందట దాత ఇచ్చిన జనరేటర్ ఆలయ ప్రాంగణంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిర్లక్ష్యంగా వదిలేయడంతో, అధికారులకు పదేపదే చెప్పి, విసిగిపోయిన ఆలయ మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ నాయకురాలు దూడల వెంకట వీరీతాదేవి రెండు రోజుల్లో జనరేటర్‌కు షెడ్డు లేదా షెల్టర్ ఏర్పాటు చేయకపోతే.. తాను ఆలయంలోనే ఆమరణ దీక్షకు దిగుతానని హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో స్పందించిన అధికారులు ఆలయంలో ఖాళీగా ఉన్న కేశ ఖండన గదిలో జనరేటర్‌ను ఉంచేందుకు నిర్ణయించి, ఆ దిశగా ఏర్పాట్లు చేపట్టారు. గురువారం నాటికి జనరేటర్‌కు షెల్టర్ కల్పించి, తగిన భద్రత కల్పిస్తున్నట్లు ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు ఆమెకు హామీ ఇచ్చారు. దాత ఇచ్చిన జనరేటర్‌కు అధికారులు షెల్టర్ సౌకర్యం కల్పిస్తుండడంతో తన ఆమరణ దీక్ష నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు వీరీతాదేవి తెలిపారు. జనరేటర్‌కు కేటాయించిన కేశ ఖండన గదిలో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు.



అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జనరేటర్‌కు సిద్ధం చేస్తున్న గది

అలరించిన చిన్నారుల భరత నాట్యం

అమలాపురం టౌన్: పట్టణ ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ 14వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి చిన్నారులు ప్రదర్శించిన భరత నాట్యం అలరించింది. ప్రదర్శన అనంతరం భరత నాట్యాన్ని ప్రదర్శించిన చిన్నారులు కార్తిక, సహస్ర, మోక్ష, హరిణీలకు అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ మాజీ ఉద్యోగి లక్కంశెట్టి సాయి సోదరుడు కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న దృష్ట్యా, సంఘం తరఫున రూ.10 వేల ఆర్థికసాయం సమకూర్చారు. అసోసియేషన్‌లో చేరిన ముగ్గురు కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన సంవత్సర వేడుకలు, ముగ్గురు సంఘ సభ్యుల పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి నూలు సూర్యప్రభాకరరావు, కోశాధికారి శ్రీఘాకోళపు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



భరత నాట్యం ప్రదర్శించిన చిన్నారులను అభినందిస్తున్న సంఘ ప్రతినిధులు

కలెక్టర్‌కు ధాన్యం కుచ్చు అందజేత



కలెక్టర్‌కు ధాన్యం కుచ్చును అందజేస్తున్న ప్రతినిధులు

అమలాపురం రూరల్: కలెక్టర్ మహేశ్ కుమార్‌కు మాజీ ప్రధాని దివంగత వాజ్‌పేయి సేవా సమితి ప్రతినిధులు బుధవారం అమలాపురం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఆయనకు ధాన్యం కుచ్చులను అందజేసి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సమితి ప్రతినిధులు నక్కా త్రిలోచనరావు, చిట్నీడి రంగసాయి, బొరుసు సూర్యనారాయణ, సాయిబాబా ఉన్నారు.

కౌశల్ విజేత హాసినికి అభినందన

అమలాపురం టౌన్: విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కౌశల్ ప్రతిభాన్వేషణ పోటీల్లో విజేతగా నిలిచిన స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దూడల హాసినిని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జిల్లా విద్యాశాఖాధికారులు సత్కరించారు. రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచి రూ.6 వేల నగదు, ప్రశంసాపత్రం, మెమెంటో అందుకున్న హాసినిని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, డీఈవో షేక్ సలీమ్ బాషా తదితరులు పాఠశాలలో బుధవారం అభినందించారు. విద్యార్థిని హాసినితో పాటు, గైడ్ టీచర్ పీవీఎల్ఎస్ శ్రీరామ్ కృషి కూడా ఈ విజయంలో ఉందని డీఈవో బాషా ప్రశంసించారు. కౌశల్ జిల్లా కో-ఆర్డినేటర్ కె.సుబ్బారాయశర్మ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఎంపికైన 52 బృందాల్లో జిల్లా తృతీయ స్థానం సాధించిందని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ అభినందన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తదితరులు విద్యార్థిని హాసినిని అభినందించారు.



విజేత హాసినిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, డీఈవో తదితరులు

మున్సిపల్ స్టాడింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా భాస్కరశాస్త్రి



అమలాపురం టౌన్: మున్సిపల్ స్టాడింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా స్థానిక భూపయ్య అగ్రహారానికి చెందిన సీనియర్ న్యాయవాది వెంపరాల భాస్కరశాస్త్రిని నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. భాస్కర శాస్త్రి నియామకంపై అమలాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

నూతన సంవత్సరానికి ఆత్మీయ స్వాగతం

- ప్రజాప్రతినిధులు, నేతలకు ప్రముఖుల శుభాకాంక్షలు

అమలాపురం టౌన్: పట్టణంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఆత్మీయ వాతావరణంలో జరిగాయి. మంగళవారం అర్ధ రాత్రి వేళ 2024 సంవత్సరానికి వీడ్కోలు పలికి, 2025 కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పట్టణంలోని పలు కూడళ్ల, ప్రముఖుల ఇళ్ల వద్ద ఆనందంగా వేడుకలు నిర్వహించారు. స్థానిక హైస్కూలు సెంటరులోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావును వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలుసుకుని, ఆయనతో కేకులు కట్ చేయించి, శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ లీగల్‌సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్ తదితరులు ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక నారాయణపేటలోని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ఇంటికి మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు వెళ్లి, శుభాకాంక్షలు చెప్పారు. స్థానిక సూర్యనగర్‌లోని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ బాబు దంపతుల ఇంటికి పార్టీ నాయకులు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సూర్యనగర్‌లోని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర దృశ్య కళల అకాడమి మాజీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ ఇళ్లకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి శుభాకాంక్షలు చెప్పారు. హౌసింగ్ బోర్డు కాలనీలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రముఖులు



అమలాపురంలో మాజీ ఎమ్మెల్యే పొన్నాడకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జిల్లా జడ్జిని కలిసిన ఎమ్మెల్సీ

పట్టణంలోని రెండో అదరపు జిల్లా కోర్టు జడ్జి వి.నరేష్‌ను న్యాయవాది, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాదులు యార్లగడ్డ రవీంద్ర, కుడుపూడి త్రినాథ్ తదితరులున్నారు.

ఎంపీపీ జానకికి శుభాకాంక్షలు

ఉప్పలగుప్తం: మండలంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దంగేటి వీరఅచ్యుత జానకి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు దంపతులకు మండల సర్పంచ్‌లు,, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు జెడ్పీటీసీ గెద్దం సంపదరావుతో పాటు, సర్పంచ్‌లకు ఎంపీటీసీలకు ఉద్యోగులు శుభాకాంక్షలు చెప్పారు. పార్టీ నాయకులు కుంచే రమణారావు, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు.ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీటీసీలు ఏడుకొండలు, బాలమ్మ తదితరులున్నారు.

కేంద్ర పాలిత ప్రాంతంలో..

యానాం: నూతన సంవత్సర వేడుకలు యానాంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌కు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గ ప్రజలతో పాటు, వివిధ శాఖల ఉద్యోగులు తరలివచ్చారు. ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్సైలు నూకరాజు, మురుగానందన్, పోలీసులు, కో-ఆపరేటివ్ చైర్మన్ విద్యాసాగర్, మత్స్య శాఖ ఏడీ గొంతియ్య, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, దళిత, ముస్లిం సంఘాల నేతలు, మహిళా సంఘాలు, యువకులు అధిక సంఖ్యలో వచ్చి, పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు అధికారులు, ప్రజాప్రతి నిధులు, వివిధ వర్గాలవారు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

అల్లవరం: నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టిన ప్రజలందరూ ఏడాది పొడవునా సుఖసంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. గోడిలోని ఆయన నివాసంలో అభిమానులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన కేక్‌ని కట్ చేసి, నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పారు. తూర్పులంకలో ఎంపీపీ శేషగిరిరావుని ఎంపీడీఓ కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. అల్లవరంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమిని అధికారులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ఎంపీపీ సునీతకు అభినందనలు

తాళ్లరేవు: నూతన సంవత్సర వేడుకలు బుధవారం తాళ్లరేవు మండలంలో ఘనంగా జరిగాయి. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీతకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు. స్థానిక పరదేశమ్మ వీధిలోని జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ కె.సత్యనారాయణ, రాయుడు గంగాధర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, యానిమేటర్లు పాల్గొన్నారు.

చర్చిలో దుస్తుల పంపిణీ

ముమ్మిడివరం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం పల్లిపాలెం కల్వరి వర్షిప్ సువార్త చర్చిలో పేదలకు దుప్పట్లు, చీరలు, పండ్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన జనిపెల్ల సంధ్యారాణి ఆర్థిక సాయంతో వీటిని అందజేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆకాంక్షించారు. తన స్వగృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఐ పోలవరం: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మురమళ్లలో టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) పాల్గొన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.



ఎంపీపీ అచ్యుత జానకి, రాంబాబు దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు, ఇతరులు



తాళ్లరేవులో న్యూ ఇయర్ వేడుకల్లో ఎంపీపీ రాయుడు సునీత, ఎంపీడీఓ సత్యనారాయణ



ఎంపీపీ శేషగిరిరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



అమలాపురంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు